

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

◆ప్రకృతి విపత్తు నష్టాలపై ప్రభుత్వానికి నివేదికలు

◆శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్



చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకం గత పది సంవత్సరాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారని, వీరికి ఉద్యానవన శాఖ ద్వారా మరింత ప్రోత్సాహం అందిస్తున్నాం. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు సంవత్సరాల నుంచి జిల్లాలో అత్యధికంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహంపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్ర: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

ఎడి : అతివష్టి అనావష్టి చేత ఇటీవల చాలామంది రైతులు సాధారణ పంటల సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ పండ్ల తోటల పెంపకాన్ని చేపడుతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. మొదటి దశలో గుంతలు తీయడానికి మొక్కలు నాటడానికి మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తోంది.

ప్ర: పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తోంది.?

ఎడి : పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను



అందిస్తోంది. వాటిలో బోరు బావుల తవ్వకంకు అవకాశం కల్పిస్తోంది. రైతులకు డ్రైలాండ్, హార్టికల్చర్, పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి ఎరువులు తదితర వాటి కోసం మూడేళ్ల పాటు ఎకరాకు 13,193 రాయితీ అందిస్తోంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే 1,07,459 రూపాయలు రాయితీ అందిస్తోంది. జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు విరివిగా ప్రభుత్వం అందిస్తోంది.

ప్ర: పండ్ల తోటల రైతులకు ఏఏ పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు.?

ఎడి: సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులు నష్టపోయారు. అత్యధికంగా కాయగూరలు పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు, అరటికి రూ.25 వేలు, మామిడికి ఎకరాకు రూ.20వేలు, నారింజ, దానిమ్మ, చీనీ, కాయగూరల పంటలకు రూ.15వేలు, కొత్తిమీర పంటకు రూ.7200 చొప్పున ఎకరాకు నష్టపరిహారం రైతులకు అందిస్తున్నాం.

ప్ర: పండ్ల తోటల రైతులకు నష్ట నివారణ చర్యలేవి.?

ఎడి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సత్యసాయి జిల్లాలో ఉద్యానవన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలతో పాటు కాయగూరలు, పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు ప్రాథమిక అంచనా ప్రకారం పంట నష్టం నివేదికను తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. జిల్లాలో 33 శాతం పంట నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు పంపాం.

ప్ర:గత నాలుగు సంవత్సరాల నుంచి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు.?

ఎడి : పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. దాని ప్రకారం ఇంకా రావాల్సిన వారికి త్వరలో నష్టపరిహారం అందుతుంది. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు, పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.



లోకేశా... సామాజిక న్యాయం ఇదేనా..?

◆ఎస్సీ మహిళ బండారు శ్రావణిశ్రీకి అడుగడుగునా అవమానాలు

◆యువగళం పాదయాత్రలో మాట్లాడే అవకాశం ఇవ్వని వైనం

◆నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నా ప్రాధాన్యత కరువు

◆టిడిపి తీరుపై బండారు శ్రావణి మద్దతుదారులు, దళిత సంఘాల నుంచి వ్యతిరేకత

'వైసిపి అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలపై దాడులు పెరిగాయని యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రతి ప్రసంగంలోనూ ప్రస్తావిస్తున్నారు. తాము ఆ వర్గాలకు అండగా నిలుస్తామని చెబుతున్నారు. అయితే ఆచరణలో చూస్తే అది కనిపించడం లేదు. తన సొంత పార్టీలో ఒక నియోజకవర్గం ఎస్సీ, మహిళను ఇద్దరు నేతలు బాహాటంగానే అవమానిస్తూ వస్తున్నా లోకేష్ చూసీచూడనట్టు ఉండటం అనేక విమర్శలకు తావిస్తోంది. ఆ ఇద్దరు నేతలను కనీసం హెచ్చరించే ప్రయత్నం చేయకపోవడం శోచనీయం. పాదయాత్ర ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నియోజకవర్గంలోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు మాట్లాడే అవకాశం కల్పిస్తూ వస్తున్నారు. కానీ ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన శింగనమలకు వచ్చే సరికి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగానున్న బండారు శ్రావణికి ఆ అవకాశం కల్పించకపోవడం రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, శింగనమల

లోకేష్ యువగళం పాదయాత్ర శుక్రవారం రోజు శింగనమల నియోజకర్గంలోకి ప్రవేశించింది. అదే రోజు యాత్ర ముగిసిన తరువాత బండారు శ్రావణి, ఆయన తండ్రి రవికుమార్‌లు లోకేష్‌ను కలిసేందుకు విడిది వద్దకు వెళ్లిన సమయంలో టూమెన్ కమిటీ సభ్యులకు సంబంధించిన ఒక వ్యక్తి వారిని కామెంట్ చేసినట్టు సమాచారం. దీనిపై బండారు శ్రావణి ప్రతిస్పందించడంతో ఏకంగా బూతుపురణాన్ని సదరు నాయకుడి సోదరుడు అందుకోవడమే కాకుండా శ్రావణి తండ్రి రవికుమార్‌పై దాడికి సైతం యత్నించినట్టు సమాచారం. దీంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆ మరుసటి రోజు నుంచి సాగు తున్న యాత్రలోనూ బండారు శ్రావణికి అడ్డంకులు తప్పడం లేదన్న చర్చ టిడిపి వర్గాల్లోనే సాగుతోంది. లోకేష్‌తోపాటు నడుస్తున్న సమయంలో శ్రావణిని పక్కకు నెట్టేస్తున్న దృశ్యాలు వీడియోలో రావడం దుమారం రేపుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శింగనమల ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలోనే ఇన్‌ఛార్జి ఉన్నప్పటికీ ఇద్దరు సభ్యులతో టూమెన్ కమిటీ వేయడం, వారి ద్వారానే నియోజకవర్గ కార్యక్రమాలు నిర్వహించే విధంగా అధి నాయకత్వం చూడటం పట్ల ముందునుంచి ఆ తరగతుల్లో అంసతృప్తి ఉంది. ఇక పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం, అనంతపురం, ఉరవకొండ అన్ని నియోజకవర్గాల్లోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులను సభల్లో లోకేష్ మాట్లాడించారు. పెనుకొండలో అయితే ఇన్‌ఛార్జి బికెతో పాటు సబితకూ అవకాశమిచ్చారు. శింగనమల నియోజకవర్గంలో వచ్చే సరికి గార్లదిన్నె సభలో ఇన్‌ఛార్జి స్థానంలో అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు ప్రసంగించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణికి అవకాశం కల్పించకపోవడం చర్చనీయాంశం మారింది. ఒకవైపు దళితులు, మహిళలకు అవకాశం ఇస్తూ తాము అండగా ఉంటామని ప్రకటనలు చేస్తూ, ఆచరణలో ఏమి చేస్తున్నారన్న ప్రశ్నలు దళిత సంఘాల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలపై ఇప్పటికే పిసిసి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ సైతం ఖండించారు. ఇతర దళిత సంఘాలు కూడా టిడిపిలో జరుగుతున్న తీరును తప్పుబడుతున్నారు. మరి దీనిపై లోకేష్, టిడిపి అధినాయకత్వం ఎలా స్పందిస్తోందో చూడాల్సి ఉంది.

పేదల పెన్నిధి ఫాదర్‌ఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగు నింపి పేదల పెన్నిధిగా నిలిచిన మహోన్నత వ్యకి విన్సెంట్ ఫాదర్‌ఫెర్రర్ అని పలువురు కొనియాడారు. ఫాదర్‌ఫెర్రర్ 103వ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అనంతపురం ఆర్డీటీ కార్యాలయంతో పాటు, బత్తలపల్లి ఫెర్రర్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అభివృద్ధి, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన నిమిత్తం 1969లో ఫాదర్ ఫెర్రర్ అనంతపురం జిల్లాలో రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్టును స్థాపించారని చెప్పారు. ఆయన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం శ్రమించారని చెప్పారు. 103వ జయంతి కార్యక్రమాల్లో స్పెయిన్ కాన్సుల్ జనరల్ ఫెర్నాండో హెరాడియా నోగుర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుందుర్పిలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, బత్తలపల్లి మండలం ముష్టూరు గ్రామంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల్ ఫెర్రర్ పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట అవే సంస్థ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆవే వ్యవస్థాపకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఫెర్ర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.



బత్తలపల్లిలో ఫాదర్ ఫెర్రర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఆయన సతీమణి, ఆర్డీటీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్

కర్నాటక మద్యం.. అక్రమార్కులకు వరం

ప్రజాశక్తి-హిందూపురం

కర్నాటక మద్యం అమ్మకాలు సరిహద్దు ప్రాంతాల్లో జోరందుకున్నాయి. కొందరు ఎస్ఇబి అధికారులు వ్యాపారులతో కుమ్మక్కవడంతోనే యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. అప్పుడప్పుడు మద్యం వ్యాపారులు ఇచ్చే సమాచారంతో కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించి ఒకరిద్దరిని అరెస్టు చేసి మమ అనిపిస్తున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, రొద్దం మండలాల పరిధిలో మద్యం అమ్మకాలు అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నాయని చెప్పవచ్చు.

ఎక్కడెక్కడంటే...

హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్‌పోస్టుతో పాటు పట్టణంలోని చిన్నమార్కెట్, త్యాగరాజ్‌నగర్, ముదిరెడ్డిపల్లి, చౌడేశ్వరి కాలనీ, మోడల్ కాలనీ, మేళాపురం తదితర ప్రాంతాలతోపాటు మోదా గేటు, లేపాక్షి, చిలమత్తూరు, రొద్దం, పరిగి మండల కేంద్రాలతో పాటు కర్నాటక సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక మద్యం అమ్మకాలు 'మూడు పూలు.. ఆరు కాయలు'గా సాగుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంతోపాటు పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి, రొద్దం మండలాల పరిధిలో కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం దుకాణాల నుంచి రోజూ పలు వాహనాల్లో నియోజకవర్గంలోకి మద్యం వస్తున్నట్లు సమాచారం. కొంతమంది మద్యం వ్యాపారులు దీనికి కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు నిత్యం దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన వివిధ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. గత సంవత్సరం సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి పక్కా సమాచారంతో భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకుని పట్టుకున్న ఉదంతాలు మినహా ప్రత్యేక తనిఖీలు, ఆకస్మిక దాడులు, సరి హద్దుల్లో నిఘా కరవైంది.

సర్కారు పాపం... వీరికి ఆదాయం

ఆంధ్రాలో మద్యం అమ్మకాలు ఉన్నా ప్రభుత్వ తప్పిదాల వల్ల కొందరు అక్రమార్కులు లాభపడుతున్నారు. కర్ణాటక మద్యం ధరలు చాలా తక్కువుగా ఉండడం, ఏపీలో మద్యం బ్రాండ్లు దొరక్కపోవడంతో మద్యం ప్రియులు కర్ణాటక మద్యానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఈ మద్యం

నామమాత్రంగా దాడులు

మామూళ్ల మత్తులో సెబ్ అధికారులు



కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం (పాతచిత్రం)

వ్యాపారాల్లో అధికార పార్టీ నాయకులకు కూడా మామూళ్లు అందుతున్నట్లు సమాచారం. కర్ణాటక మద్యానికి డిమాండ్ బాగా పెరగడంతో ప్రతి గ్రామంలో మద్యం వ్యాపారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులకు మామూళ్ల డిమాండ్ బాగా పెరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక, కర్ణాటక మద్యం ఆక్రమ రవాణాలు నివారించడానికి. ఏర్పాటు చేసిన చెకోపోస్టుల్లో ఏర్పాటు చేశారు. అయితే ఈ చెకో పోస్టుల్లో పనిచేసే సిబ్బంది తక్కువగా ఉండడంతో తూతూమంత్రంగానే తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో చెకో పోస్టుల మీదుగానే తెల్లవారుజామున సమయంలో మద్యం సరఫరా అవుతోంది.

కర్ణాటక మద్యాన్ని నిర్మూలిస్తాం : ఎస్ఇబి సిఐ స్వర్ణలత

త్వరలో కర్ణాటక మద్యాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బార్డర్ మొబైల్ పార్టీ, ఎస్ఇబి పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారు. ఇటీవల మద్యం స్వాధీనం చేసుకున్నాం. త్వరలోనే కర్ణాటక మద్యానికి చెక్ పెడతాం. మద్యం అమ్మకందారులను అరెస్టు చేస్తున్నాం. ప్రజల నుంచి సహకారం కావాలి. సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచి, మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

అందరినీ కలుసుకుంటూ..సమస్యలు వింటూ..

శింగనమలలో 65వ రోజు లోకేష్ యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వివిధ తరగతుల వారిని కలుసుకుంటూ... వారి సమస్యలు తెలసుకుంటూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం 65వ రోజు కొనసాగింది. ఆదివారం ఉదయం జంబులదిన్నె వద్ద ప్రారంభమైన పాదయాత్ర వెస్టు నరసాపురం, చిన్నజలాలపురం, శింగనమల మీదుగా సోదనపల్లి క్రాస్ వరకు పాదయత్ర సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల వివిధ తరగతుల వారిని కలుసుకుని లోకేష్ మాట్లాడారు. ఉదయం ప్రయివేటు ఆసుపత్రుల డాక్టర్లతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20,30 పడకలున్న ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని ప్రయివేటు డాక్టర్ను కోరారు. దంత సమస్యలకు ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలని కోరారు. దీనికి లోకేష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం పాదయాత్ర వెస్టునరసాపురం వద్దకు చేరుకుంది. అక్కడ లోకేష్ పొలంలోకి దిగి కౌలు రైతులతో మాట్లాడారు. వేరుశనగ పంట సాగు చేస్తే పెట్టుబడి కూడా చేతికి రాలేదని రైతులు తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ మోటర్లకు మీటర్లు పెడుతామంటున్నారు... ఇప్పటికే వ్యవసాయం భారమైన సమయంలో ఇది అమలు జరిగితే మరింత భారం పడుతుందని మహిళా రైతు లక్ష్మిదేవి లోకేశ్‌కు చెప్పారు. మరో తోటలో బెండ రైతు నారాయణరెడ్డితో మాట్లాడారు. రూ.70 వేలు పెట్టుబడి అయ్యిందని, అది కూడా వచ్చే పరిస్థితి లేదని నారాయణరెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన లోకేశ్‌ను కోరారు. వాల్మీకులను ఎస్టీల జాబాతాలో చేర్చాలని వాల్మీకి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనికి లోకేశ్ స్పందిస్తూ టిడిపి హాయంలో దీనిపై వేసిన సత్యపాల్ కమిటీ నివేదిక వచ్చిందని, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు దానిని బయటపెట్టలేదని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కమిటీ నివేదికను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. విశ్వ బ్రాహ్మణులు ఆయన్ను కలసి వారి సమస్యలను విన్నవించారు. వడ్రంగి పనిచేసే విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వం వైపు నుంచి తోడ్పాటు అందివ్వాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని లోకేష్ హామీనిచ్చారు. అనంతరం కురబ సంఘం నాయకులు, గొర్రెల కాపరులు కలసి వారి సమస్యలను తెలియజేశారు. గొర్రెల పెంపకానికి పది ఎకరాల భూమిని గ్రామానికి కేటాయించాలని, వంద శాతం సబ్సిడీతో గొర్రెల షెడ్లు ఇవ్వాలని, కురబ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చాక కురుబలకు తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. వెస్టు నరసాపురం, చిన్నజలాల పురం గ్రామస్తులు వారి గ్రామాలకు పిఎబిఆర్ నీటిని అందవ్వాలని కోరారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను పలుకరిస్తూ లోకేష్ పాదయాత్ర సాగింది. శింగనమల వద్ద చెరువుల్లో బోట్లలో స్వాగతం బ్యానర్లు పట్టుకుని టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అదే విధంగా శింగనమల రామాలయం వద్ద క్రేన్ సహాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఇలా పెద్దఎత్తున లోకేశ్ పాదయాత్రకు స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



యువగళం పాదయాత్రలో వెస్టు నరసాపురం వద్ద బెండ రైతులతో మాట్లాడుతున్న నారా లోకేష్

అల్లా దీవెనలతో అందరికీ మంచి జరగాలి

డాక్టర్ బత్తల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-కదిరిటౌన్

అల్లా దీవెనలతో అందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిములకు ఆదివారం పట్టణంలోని నిజం వల్లి కాలనీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంతకుముందు ముస్లిములతో కలిసి అబుబకార్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగ రంజాన్ అన్నారు. అలాంటి పవిత్ర రంజాన్ మాసంలో అకుంట దీక్షతో ముస్లిములు ఉపవాసాలు చేస్తున్నారన్నారు. అల్లా దీవెనలతో అందరి సహకారంతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల వెంకటరమణ, వైసిపి యువ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, పట్టణ కార్యదర్శి బహుద్దీన్, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, సంపంగి గోవర్ధన్, కౌన్సిలర్లు, మహబూబ్ బాషా, ఖసిం, ఎంఎస్.ఫయాజ్ అలీఖాన్, షబ్బీర్, ఇస్మాయిల్, 1500 మంది ముస్లిములు పాల్గొన్నారు.





ముస్లిములతో డాక్టర్ బత్తల హరిప్రసాద్, ఇఫ్తార్ విందును వడ్డిస్తున్న బత్తల

బాగేపల్లి న్యూస్

ప్రతి నిరుపేదకూ ఇంటి స్థలం

సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-చిలమత్తూరు(బాగపల్లి నుంచి)

'నన్ను గెలిపిస్తే గుడిబండ హోబ్లీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తాం' అని సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈమేరకు గుడిబండ తాలుకా కేంద్రంలోని 1, 2, 4, 5, 6వ వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిబండ హుబ్లీ పరిధిలో దాదాపు ఐదేళ్ల నుంచి పలువురు పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. అంతేగాకుండా గుడిబండను టూరిస్ట్ ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే గతంలో సిపిఎం ఎమ్మెల్యే ఉన్నప్పుడు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. అయితే ఇప్పుడు నీటి కొళాయిలకు మీటర్లు బిగించడం బాధాకరమన్నారు. నీటిని కూడా వ్యాపారం చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము గెలిచిన వెంటనే మీటర్లు తొలగించి ఉచితంగా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిబండ తాలుకా కార్యదర్శి జయరామ్‌రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, ఎల్ఎ.బాబు, ఉన్నతి విశ్వనాథ్, అఫ్రోజ్, రఫీఉల్లా, శివలింగ, సోమశేఖర్‌రెడ్డి, నయాజ్, మంజు, ఆజాం, సాధిక్, మన్సూర్, సమీ, తదితరులు పాల్గొన్నారు.



గుడిబండలో ప్రచారం చేస్తున్న సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

పేదలకు సాయం చేయడమే 'ఫాదర్'కు నిజమైన నివాళి

ప్రజాశక్తి-బత్తలపల్లి

కరువు కాటకాలతో నిత్యం అల్లాడిపోతున్న జిల్లాలోని పేదల కోసం ఎనలేని కృషి చేసిన ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఉన్న ఘాట్ వద్ద ఫెర్రర్ సతీమణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్, ఆసుపత్రి, ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్డీటీ అంటేనే పేదలకు భరోసా అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి చాలామంది పేదలు ఎంతో నమ్మకంతో వస్తారన్నారు. ఆయన స్ఫూర్తితో సేవలు కొనసాగిస్తామన్నారు. అంతకు ముందు కేక్ కోసం పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎటిఎల్ రుక్మాంగద, తదితరులు పాల్గొన్నారు. అలాగే తోటి మనుషులకు సాయపడడం, పేదలకు సేవ చేసినప్పుడే ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నిజమైన నివాళి అని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఎటిఎల్ రుక్మాంగద అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఫాదర్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని కోడేకండ్ల, ఈదుల ముష్టూరు గ్రామంలో ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పెయిన్ బృందం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బత్తలపల్లి మండలంలో ఏర్పాటు చేసిన స్పందించి.. సాయమందించు కార్యక్రమానికి సంబంధించిన హుండీలను



కొత్తచెరువు మండలంలో ఫెర్రర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

జిల్లావ్యాప్తంగా ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతి



బత్తలపల్లి మండలంలో ఫెర్రర్‌కు నివాళులర్పిస్తున్న మహిళలు

ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 3.100 హుండీల ద్వారా రూ.13.20లక్షలు వచ్చినట్లు తెలిపారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోని ప్రజలు విన్సెంట్ ఫెర్రర్, మాంచూఫెర్రర్ చిత్రాలను ఊరేగించారు. తర్వాత సంజీవపురం వద్ద ఫాదర్ విగ్రహం ముందు కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి సంఘాలు, సిబ్బంద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఫాదర్‌ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, సర్పంచి రాధా నాగరాజు తెలిపారు. ఫాదర్‌ఫెర్రర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కొత్తచెరువులోని కార్యాలయంలో మామిళ్లకుంట క్రాస్ బైరాపురం క్రాస్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లా అనంతపురంలో ఆర్డీటీ సంస్థ నిరుపేదల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఫెర్రర్ గ్రామాల్లోని ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. 'స్పందించి సహాయం అందించు' అనే కార్యక్రమాన్ని నెలకొని ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక బిసి బాలుర వసతి గృహం వద్ద దివంగత విన్సెంట్ ఫాదర్‌ఫెర్రర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ నాగభూషణ నాయుడు అధ్యక్షతన కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాగభూషణంనాయుడు, మాజీ సర్పంచి చంద్రాయుడు, చెన్నారెడ్డి, రవినాయక్, పుట్ల రవీంద్ర, నరసపు గంగులప్ప, తప్పిటి కిష్ట, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

హిందూపురం : పట్టణ పరిధిలోని కొల్లకుంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల మేరకు.. కొత్తచెరువుకు చెందిన దాదాఖలంధర్ (21), మహమ్మద్ గౌస్ సొంత పని నిమిత్తం హిందూపురం వస్తుండగా పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్దక రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ప్రీకాట్ మిల్లుకు సంబంధించిన వాహనంలో పట్టణంలోని ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్తుండగా దాదాఖలంధర్ మార్గమధ్యంలో మృతిచెందాడు. గాయపడిన మహమ్మద్‌గౌస్‌కు అసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కొత్తచెరువు : ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే సొరంగం వద్ద ఆదివారం సాయంకాలం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, లైన్స్ షర్ట్, పంచ ధరించి ఉన్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లింగన్న ఘటనా స్థలానికి చేరుకుని హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురానికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఐచర్

కనగానపల్లి : మండల పరిధిలోని దాదులూరి జంక్షన్ వద్ద ఆదివారం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐచర్ వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఢీకొన్న వెంటనే గ్రామంలోకి దూసుకెళ్లింది. అయితే ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



చెట్టును ఢీకొన్న ఐచర్

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తికి గాయాలు



గాయపడిన బషీర్

ఓబుళదేవరచెరువు : మండలం పరిధిలోని సున్నంపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో బషీర్ (35)కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొక్కంటి గ్రామానికి చెందిన బషీర్ కదిరిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో కదిరి నుంచి తల్లిదండ్రులు ఉంటున్న స్వగ్రామం కొక్కంటి వస్తుండగా సున్నంపల్లి క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించబోయి ద్విచక్ర వాహనం బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన బషీర్‌ను స్థానికులు 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. ఇటీవల పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి వద్ద జరిగిన ఘర్షణలో వైసిపి నాయకులు చేసిన చెప్పులు, రాళ్లు, కర్రల దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలను వారి ఇళ్లకు వెళ్లి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి గూండల దాడితోపాటు పోలీసులు కూడా తమ కార్యకర్తలపై లాఠీఛార్జి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. ఎస్టీ మహిళపైన కూడా దారుణంగా దాడి చేయడం బాధాకరమన్నారు. అంతేగాకుండా తమపైనే దాడి చేయడంతోపాటు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెట్టడం బాధాకరమన్నారు. అయినా వైసిపి అరాచకాలకు భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా, దాడులు చేసినా వెనక్కి తగ్గేదేలే.. అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, ఆదిశేషప్ప నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎస్.వంశీ, కిషోర్, కిరణ్, షర్ఫుద్దీన్, సప్లయర్స్ నాయుడు, నల్లమాడ శంకర్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

చిలకం మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన అభిమానులు భారీ కేక్ కోసి పంచిపెట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పెద్దఎత్తున తరలివచ్చి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జనసేన పార్టీ మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, నాయకులు నాయుడూనాయక్, నాగసుధాకర్‌రెడ్డి, చంద్రబాబు, తదితరులు ఉన్నారు. కాగా నియోజకవర్గం నుంచి పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో పట్టణానికి చెందిన రియాజ్, ఇబ్రహీం, అమ్ము, గౌతమ్, ప్రకాశ్, తిరుమలేశ్, భాస్కర్, రవికుమార్, వెంకీ, జయరాములు, శ్రీకాంత్, ముదిగుబ్బనం చిసాకేనాగేంద్ర, గొనువారిపల్లి పక్రుల్లా, అరవాటి విజయ్, చందు, ప్రసాద్, కంసల చైతన్య, కంచం హేమేంద్రకుమార్, గంగినేపల్లి సాయికుమార్. మద్దెల విష్ణువర్ధన్, శ్రీనివాసులు, సాకేచిన్న, తాడిమర్రి నుంచి మోహన్, వెంకటేష్, వీరాంజనేయులు, నరేష్, కుళ్లాయప్ప, నూరు, మస్తాన్,రమణ, బద్రి, చంద్ర, హనుమంతు, తదితరులు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కార్మికుల హక్కులను ప్రధాని నరేంద్రమోడీ కాలరాస్తున్నాడని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి విమర్శించారు. ఆదివారం సాయి ఆరామంలో నిర్వహించిన ఎఐటియుసి జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ ఉద్యోగులపై దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు రక్షణ లేకుండా చేస్తున్నాడని వాపోయారు. ముఖ్యంగా అదానీ, అంబానీలను పెంచి పోషిస్తున్నాడన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తున్నాడన్నారు. అంగన్‌వాడీల రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ మహిళా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా అణచివేస్తున్నారన్నారు. కావున కనీస వేతనాల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బయన్న, జిల్లా నాయకులు ఆంజనేయులు, శ్రీరాములు, బాబు, వినోద్, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి సంపూర్ణమ్మ, ఆశావర్కర్ల జిల్లా కార్యదర్శి నాగమణి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, గౌస్ లాజాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో భయపెట్టే కుట్ర : టిడిపి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైసిపి ప్రభుత్వం టిడిపి నాయకులు, కార్యకర్తలపై పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 1న సత్యమ్మ ఆలయ సర్కిల్‌లో జరిగిన వైసిపి దాడుల్లో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు గాయపడ్డారన్నారు. అయితే గాయపరిచిన వారిపై కేసులు నమోదు చేయకుండా గాయపడిన వారిపైనే కేసులు బనాయించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా నూతన ఎమ్మెల్సీల పదవీ స్వీకారం సందర్భంగా మార్చి 31న తాను విజయవాడలో ఉన్నానన్నారు. పుట్టపర్తిలో లేకపోయినా తనపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించడంలేదని, కేవలం వైసిపి నాయకుల మాటలు విని కేసులు పెట్టినట్లు తెలుస్తోందన్నారు. సీసీ కెమెరాలు ఫుటేజీని కూడా పరిశీలించలేదని అర్థం అవుతోందన్నారు. ఈ అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

రాష్ట్రాభివృద్ధే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 6వవార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఇళ్లకు పోస్టర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం అందుతోందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. వైసిపి మేనిఫెస్టోలో పొందుపరిచిన 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తుంగ ఓబుళపతి, వైస్‌ఛైర్మన్లు తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, జిల్లా మెప్మా అధ్యక్షురాలు సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : రాష్ట్రం అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు మండలంలోని తిప్పరాజుపల్లి గ్రామం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ లబ్ధిదారుల ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలను తీసుకొచ్చి ఇంటింటికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ గ్రామ సచివాలయం ద్వారా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, ఎంపిపి ప్రమీలామూర్తి, జడ్పిటిసి జయరాంనాయక్, సర్పంచులు సరోజా, నాగేనాయక్, ఉపసర్పంచి రాజారెడ్డి, వాసునాయక్, ఆంజనేయులు, నర్సిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అన్నారు. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చేపలేటి, వడ్రపాలెం గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుని స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సిఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. అంతేగాకుండా ఇప్పటికే దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సచివాలయాలను తీసుకొచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసింహ, కుమారుడు జయరాజు, సచివాలయ కన్వీనర్ చంద్రశేఖర్, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యమని ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి అన్నారు. మండలంలోని గరికలపల్లి, దంపెట్ల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుమ్మలకుంట గ్రామంలో సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుని ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, వెంకట్, బండి వీరనారప్ప, నాగిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : వైసిపి చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం కార్యక్రమం పట్టణంలో విస్తృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'లో నాయకులు



పుట్టపర్తి మండలంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



గోరంట్ల మండలంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం హస్నాబాద్‌లో స్టిక్కర్‌ను అతికిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా ఈస్టర్ పండగ

పుట్టపర్తి రూరల్ : మండలవ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కర్ణాటక నాగేపల్లి కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ క్రీస్తు చనిపోయిన 3వరోజున సమాధి నుంచి తిరిగి లేచిన రోజును పురస్కరించుకుని ఈస్టర్ పండగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని క్రైస్తవులు ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం బైబిల్‌లోని పలు అంశాలను విశదీకరించారు.

ఓబుళదేవరచెరువు : యేసు క్రీస్తు సిలువ వేయబడి తిరిగి లేచిన పర్వదినాన్ని పురస్కరించుకుని ఈస్టర్ వేడుకలను నిర్వహించుకుంటున్నట్లు బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని సిఅండ్ఐజి మిషన్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి ఈస్టర్ ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డాక్టర్ ఎంజి జయానందం, చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, సభ్యులు వినయ్‌కుమార్, బాలరాజు, రఘు కుమార్, సునీల్ పాల్గొన్నారు.



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

విద్యుత్ కోతలను నిరసిస్తూ నేడు ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణంలోని 40వ వార్డు ఇన్‌ఛార్జి, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, తెలుగు మహిళలు, పరిటాల అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

పుట్టపర్తి రూరల్ : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ కార్యాలయం ముట్టడి, నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల కన్వీనర్ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన తెలపనున్నట్లు తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు.

నేడు సచివాలయాల్లో 'స్పందన'

బత్తలపల్లి : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహశీల్దార్ యుగేశ్వరీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

ఓబుళదేవరచెరువు : వేసవిని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద కొత్తపల్లి బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ గోపీ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎండల అధికం కావడంతో తాగునీటి కోసం ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పరిస్థితిని గుర్తించి చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల బాషాను అభినందించారు. చలివేంద్రాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సచివాలయ కన్వీనర్‌గా నరసింహారెడ్డి

గోరంట్ల : మండల సచివాలయ కన్వీనర్‌గా కసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డిని ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మండల సచివాలయ కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్యే సోదరుడు మల్లికార్జునకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫిష్ ఆంధ్ర చేపల మార్కెట్ ప్రారంభం

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర చేపల మార్కెట్‌ను ఎంపిపి పర్వీన్‌భాను ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పిన విధంగానే ఫిష్ ఆంధ్ర చేపల మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. తద్వారా పేదల జీవనోపాదులు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోవిందు, సొసైటీ సభ్యులు మందోజి ఆరీఫ్‌ఖాన్, పరికి కృష్ణ, రామచంద్ర, నాగేశ్వర, అబ్దుల్, అంజప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్‌గా అబ్దుల్ కలామ్



హిందూపురం : హిందూపురం రూరల్ స్టేషన్ ఎస్ఐగా అబ్దుల్‌కలాం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రూరల్ మండల వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

11న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

బుక్కపట్నం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎనిమిదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు జిల్లా విద్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల ద్వారా బోధించే ఉపాధ్యాయులు వై బైక్స్ శిక్షణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ సమయాలను సంబంధిత డివైఇఒ, ఎంఇఒల ద్వారా తెలుసుకోవాలని కోరారు.